17వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
ఎన్టీఆర్ - కృష్ణా
శుక్రవారం 12 ఏప్రిల్ 2024
పేజీలు 8



భక్తిశ్రద్ధలతో పవిత్ర రంజాన్ 4

## విద్వేషాలు రెచ్చగొడితే
# కఠిన చర్యలు



వివరాలు లోపలి పేజీల్లో...



# నిరాధార ఆరోపణలు

- ఆధారాలతో నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటా?
- ఎన్నికల సమయంలోనే నిరాధార ఆరోపణలు చేస్తున్నారు
- అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వెళుతున్నా
- జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట టౌన్, ఏప్రిల్ 10, మేజర్ న్యూస్ : పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభాను పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పత్రికలో (నేటి దినపత్రిక సూర్య కాదు) తన మీద తన కుటుంబ సభ్యులకు పైన నిరాహార ఆరోపణలతో కథనం ప్రచురించారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం, మట్టి, గుట్కా ఇసుక, లిక్కర్ వ్యాపారాలు చేస్తున్నట్లు ప్రచురించారని నిజంగానే అక్రమ వ్యాపారాలు నిర్వహిస్తే ఐదు సంవత్సరాలుగా ఎందుకు ప్రచురించలేదని నిలదీశారు. గత రెండు నెలల క్రితం వేరే పత్రికలో కూడా ఇదే వార్త ప్రచురించారని దానిపై ఖండన ఇచ్చిన ఆ పత్రిక ప్రచురించ లేదని ఆయన అన్నారు. ప్రతిసారి ఎన్నికల సమయంలోనే ఆ రెండు పత్రికలు నిరాధార ఆరోపణలు ప్రచురిస్తున్నాయని ఇది సమంజసం కాదని నిజాలు ఉంటే నిర్భయంగా ప్రచురించాలని అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వెళుతున్నానని దేవాలయల అభివృద్ధికి కృషి చేసే వాడినని, దేవాలయాల భూముల కబ్జా చేస్తున్నట్లు ప్రచురించరని, జగ్గయ్యపేట ప్రజలకు తానేంటో తెలుసని అన్నారు. నిరాధార ఆరోపణలు చేసిన పత్రికలో తన ఖండన కూడా ప్రచురించాలన్నారు. లేనిపక్షంలో జగ్గయ్యపేట బస్టాండ్ వద్ద బహిరంగ

మిగతా 2లో...

# అందరికి సంక్షేమ పథకాలు

## 64వ డివిజన్ లో ఓట్లు అభ్యర్థించిన వెలంపల్లి, కేశినేని నాని
## పాల్గొన్న మల్లాది విష్ణు, సర్నాల తిరుపతిరావు

విజయవాడ సెంట్రల్, మేజర్‌న్యూస్ : ఎన్టీఆర్ జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షులు వైస్సార్సీపీ సెంట్రల్ నియోజకవర్గం వైస్సార్సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు,ఎంపీ అభ్యర్థి కేశినేని నాని గురువారం నియోజక వర్గంలో స్థానిక 64వ డివిజన్ కుందా వారి కండ్రిక తదితర ప్రాంతాలలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ, శ్రీరాములు, మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి

మిగతా 2లో



# అవనిగడ్డలో...
## వైసీపీకి షాక్‌ల మీద షాకులు



2 లో

(మొదటిపేజీ తరువాయి)



## నిరాధార ఆరోపణలు

చర్చ వేదిక ఏర్పాటు చేస్తామని తన పైన తన కుటుంబ సభ్యుల పైన చేసిన ఆరోపణలకు ఒక్కటైన ఆధారాలతో నిరూపిస్తే రాజకీయాల నుండి శాశ్వ తంగా తప్పుకుంటానని ఉదయభాను అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు. వైయస్సార్సీపి యువజన అధ్యక్షులు ఆవాల భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు

### సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్న ఇరువురిపై కేసు నమోదు : జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** సోషల్ మీడి యాలోని ఫేస్ బుక్, వాట్సాప్, ఇతర ప్లాట్ ఫామ్స్‌లో ప్రధాన ప్రత్యర్థి పార్టీల అభ్యర్థుల పైన, కార్యకర్తల పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, వ్యక్తిగత ఆరోపణలకు, దూషణలకు దిగు తూ తద్వారా సదరు రాజకీయ పార్టీల మధ్య ఉద్రిక్తతలను, ఘర్షణ వాతావ రణా న్ని సృష్టిస్తున్న రెండు ప్రధాన పార్టీలకు చెందిన ఇద్దరు వ్యక్తులపై కృష్ణా జిల్లా పెనమలూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. పెనమలూరు మండలం వణుకూరు గ్రామానికి చెందిన ఉయ్యూరు మహేష్, అరెపల్లి శ్రీకాంత్ అనే ఇద్దరు రాబోయే సాధారణ ఎన్నికలలో పెనమలూరు అసెంబ్లీ నియోజక వర్గంలో పోటీలో ఉన్న రెండు ప్రధాన పార్టీ అభ్యర్థులకు అనుబంధంగా పని చేస్తూ సోషల్ మీడియాలో తమ తమ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తూ ఉంటారు. అయితే గత కొద్ది రోజులుగా వీరి వ్యవహారం శ్రుతి మించి ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను, కార్యకర్తలను అసభ్యకరంగా చిత్రిస్తూ, అనుచితమైన, వ్యక్తిగతమైన ఆరోపణలు చేస్తూ దూషణలకు దిగుతూ తద్వారా ఇరు పార్టీల మధ్య, వివిధ సామాజిక వర్గాల, గ్రూపుల మధ్య ఉద్రిక్తతలు పెచ్చరిల్లి ఘర్షణలు చోటు చేసుకునే విధంగా వివిధ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతూ సర్క్యూలేట్ చేస్తున్నారు. ఈ విషయం పెనమలూరు నియోజకవ ర్గంలో సంచలనం కలిగించి ఉద్రిక్తతలకు దారి తీసింది. ఈ విషయాన్ని గుర్తించిన వణుకూరు గ్రామ రెవెన్యూ అధికారి గద్దె వెంకటేశ్వరరావు సమాచారాన్ని ఉన్నత అధికారుల దృష్టిలో పెట్టి పెనమలూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వగా ఎస్ ఐ ఉషారాణి వివిధ సెక్షన్ ల క్రింద వారిరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ఉద్రిక్తతలు రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తప్పవంటూ జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

### ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు

## ఫామ్ 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ వేయాలి

**పెడన, మేజర్ న్యూస్ :** రాబోయే ఎన్నికలలో ఎన్నికల బూతులలో పోలింగ్ నిర్వహించే ఓ పి ఓ గా విధులు నిర్వహించే టీచర్స్, ఇతర శాఖల సిబ్బంది ఫామ్ 12 దరఖాస్తు చేసుకునే పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి. వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ప్రభుత్వ జిల్లా ఎన్నికల అధి కారి వారి ఆదేశాల ననుసరించి రాబోవు సాధారణ ఎన్నికలలో ఓపిఓగా విధులు నిర్వహించే టీచర్స్, ఇతర శాఖల సిబ్బందికి పోస్టల్ బాలట్ కొరకు ఫామ్ 12 సమర్పించవలసి ఉన్నదన్నారు. ఇందుకు గాను ఫామ్ 12తో పా టు ఓటర్ ఐ డి తో ఆధార్ జత చేసి ది.12.04.2024, 13.04.2024 లలో రిటర్నింగ్ అధికారి వారి కార్యాలయం, (తహసీల్దార్ వారి కార్యాల యం) పెడనలో ఏర్పాటు చేసిన పోస్టల్ బాలట్ కౌంటర్‌లో అందజేయాలని పేర్కొన్నారు. ఈనెల ది. 15.04.2024 లోపు ఫామ్ 12 లు అందరూ సబ్మి ట్ కోరారు. అంతేగాక పిఓ, ఏపీవో విధులు నిర్వహించే అధికారులకు ది.13.04.2024 న వాసవి ఇంజనీరింగ్ కళాశాల లో శిక్షణ తరగతులు కలవు. సదరు సదరు ఉద్యోగుల నుండి పాము 12 కళాశాల వద్ద కూడా స్వీకరిస్తామని తెలిపారు. ఈ పోస్టల్ బ్యాలెట్ పై ఏవైనా సందే హాలు అధికా రులకు ఉంటే పోస్టల్ బాలట్ నోడల్ ఆఫీసర్‌గా బంటుమిల్లి తహసీల్దార్ వై. రవి కుమార్ పెడన ఆర్వో ఆఫీస్‌లో అందుబాటులో ఉంటారని తెలిపారు.

# అందరికి సంక్షేమ పథకాలు





(మొదటిపేజీ తరువాయి)

జగనన్న హయాంలో చేకూరిన లబ్దిని వివరిస్తూ కరపత్రం అందచేసి ప్రజలతో మాట్లాడుతూ ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడితూ డివిజన్ పర్యటనలో భాగంగా 64వ డివిజన్ పరిధిలో పర్యటించడం జరిగింద న్నారు. వైస్సార్సీపీ హయాంలో డివిజన్ డివిజన్ అభివృద్ధి జరిగిందన్నారు. అందరం కలిసి ప్రజల వద్దకు వెళ్లడం జరిగిందన్నారు. కేశినేని నాని మాట్లాడుతూ ప్రజల నుండి మంచి స్పందన వస్తోందని, వైస్సార్సీపీ అభ్యర్థులు గెలిపించాడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో 64వ డివిజన్ సీనియర్ నాయకులు వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## మైనారిటీలకు పెద్ద పీట వేసిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి

### ఎన్టీఆర్ జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షులు, సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లిశ్రీనివాసరావు

సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో గల పలు మసీదుల వద్ద పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా మైనారిటీలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎన్టీఆర్ జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షులు, సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రార్దనలు చేసి అనంతరం మైనారిటీ సోదరులను ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ సందర్భంగా మైనారిటీ సోదరులను కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగిందన్నారు. నగర పాలక సంస్థ వారి తరపున అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. సోదర భావానికి ప్రతీక రంజాన్ అని



తెలిపారు. అల్లా ఆశీస్సులు రాష్ట్ర ప్రజలు, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పై ఉండాలని ప్రార్థించారు. నాడు మైనారిటీలకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి 4శాతం రిజర్వేషన్ ఇచ్చి మైనారిటీలకు చేరువ అయితే. నేడు మనందరి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ముస్లిం మైనారిటీలకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ రుహుల్లా, ముస్లిం మైనారిటీ నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.





# అవనిగడ్డలో వైసీపీకి షాక్‌ల మీద షాకులు

### బుద్ధప్రసాద్ చేరిక, మండలి రాజేష్ మంత్రాంగంతో వరుస చేరికలు

### వక్కపట్లవారి పాలెం నుంచి త్వరలో జనసేనలోకి భారీగా చేరికలు

**అవనిగడ్డ, మేజర్‌న్యూస్ :** పొత్తులో భాగంగా అవనిగడ్డ సీటు జనసేన ఖాతాలో చేరిన నాటి నుంచి వైసీపీకి చుక్కలు కనబడుతున్నాయి. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ చేరిక, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ మంత్రాంగం వైసీపీకి షాకుల మీద షాకులు తగిలేలా చేస్తున్నాయి. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబుకి అతి సన్నిహిత వర్గం జనసేన గూటికి చేరిపోగా, ఇప్పుడు మరో షాక్ తగలబోతోంది. వక్కపట్ల వారి పాలెం గ్రామానికి చెందిన యువత పెద్ద సంఖ్యలో జనసేన గూటికి చేరనున్నారు. వైసీపీ నుంచి దాదాపు 200 మంది ఒకేసారి జనసేనలోకి చేరేందుకు సిద్ధమయ్యారు. రానున్న ఎన్నికల్లో జనసేన బిజెపి తెలుగుదేశం కూటమి అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్థి మండలి బుద్ధ



ప్రసాద్ ను, జనసేన రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ ను అవనిగడ్డ బుద్ధ ప్రసాద్ నివాసంలో నాగాయలంక మండలం వక్కపట్లవారి పాలెం గ్రామానికి చెందిన యువకులు మర్యాదపూర్వకంగా కలిసి కూటమి అభ్యర్థులను అత్యంత



భారీ మెజారిటీతో గెలుపిస్తామని, పవన్ కళ్యాణ్ ఆశయసాధనకు తమవంతు కృషి చేస్తామంటూ ముందుకు వచ్చారు. వక్కపట్ల వారి పాలెం గ్రామం నుంచి మొట్టమొదటి సారి యువత జనసేన జెండా పట్టనుండడం నాగాయలంక మండలంలో హాట్ టాపిక్ గా మారింది. అవనిగడ్డలో వైసీపీ పని అయిపోయిందన్న చర్చ మొదలయ్యింది. ఈ కార్యక్రమంలో అంబటి వెంకటరమణ, అంబటి లక్ష్మణ ప్రసాద్ ( చిన్న), పద్యాల వెంకటరమణ, మద్ది చెందు, సింహాద్రి పవన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మానికొండ లో ఇళ్లస్థలాల సమస్య పరిష్కరిస్తాం



గన్నవరం (ఉంగుటూరు), ఏప్రిల్ 11, మేజర్ న్యూస్ : టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మానికొండ గ్రామంలో ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించి అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని గన్నవరం నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి, కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్ ఇళ్లులేని పేదలకు హామీ ఇచ్చారు. గురువారం సాయంత్రం గ్రామంలో గడపగడపకు ప్రజాగళం కార్యక్రమంలో బిజెపి, టిడిపి, జనసేన నాయకులతోను తన భార్య లక్ష్మీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధుల్లో పర్యటిస్తూ ఇంటింటికి వెళ్లి టిడిపి ఎన్నికల మేనిఫెస్టోను గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి తన సోదరుడు వెంకట్రావు చేపట్టబోయే సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు సతీష్ పంపిణీ చేశారు. గ్రామంలో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కాలేదని మరో రెండు నెలలు ఓపిక పడితే తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆ వెంటనే అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. గ్రామంలో ధ్వంసమైన అంతర్గత రహదారులను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన వీటిని తన సోదరుడు వెంకట్రావ్ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అధికారం చేపడితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని రాష్ట్ర ప్రజలందరూ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. గన్నవరం నియోజకవర్గం అభివృద్ధికి అహర్నిశలు పరితపిస్తున్న తన సోదరుడు వెంకట్రావ్ కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని సతీష్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఆరుమల్ల వెంకటకృష్ణారెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు మండవ రమ్య,గ్రామ పార్టీ అధ్యక్షులు ఎడ్లపల్లి సాయి యూనిట్ ఇంచార్జ్ ఆరికట్ల రవికుమార్, రాజ్ కుమార్, గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు బెజవాడ నాగేశ్వరరావు, లాబాను, దాదా, వారికూటి కిషోర్, బువనేష్,రవి చంద్, నూతక్కి బెనర్జీ,ప్రకాష్, తాతినేని పార్వతి, రసూల్, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

# పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో ఆర్డీవో సమీక్ష



నందిగామ, ఏప్రిల్ 11, మేజర్ న్యూస్: పట్టణంలో ఆర్డీవో కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ.రవీంద్ర రావు వివిధ పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో ఈ క్రింది విషయములు చర్చించారు. విజయవాడ లో జరిగే ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషిన్ మొదటి ర్యాండో మిజషన్ జరుగుతుందని నందిగామ లో కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తామని తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాం గ్ రూమ్‌లను. రాజకీయ పార్టీల ప్రతినిధులకు చూపించారు.స్వీప్ ఆక్టివిటీ లో భాగంగా బ్యాలెట్ యూనిట్ బెలూన్ మోడల్ ను గురువారం పట్టణం గాంధీ సెంటర్ లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.ఈ సమీక్ష సమావేశంలో నందిగామ నియోజకవర్గ వివిధ పొలిటికల్ పార్టీ ప్రతినిధులు, నందిగామ తహసీల్దార్ సరస్వతి, వీరుల్లపాడు తహశీల్దారు కె. రాజా కిషోర్, నందిగామ సి ఐ అనిష్ పాల్గొన్నారు.



# 1,142 ఫిర్యాదుల పరిష్కారం

### ప్రతి ఫిర్యాదుపైనా ప్రత్యేక దృష్టి : కలెక్టర్ ఎస్.డిల్లీరావు

విజయవాడ మేజర్ న్యూస్: జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ) తదితర మార్గాల ద్వారా 1,156 ఫిర్యాదులు రాగా 1,142 ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ పూర్తయిందని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ ఎస్.డిల్లీరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఓటరు హెల్ప్‌లైన్ (1950) ద్వారా 186 ఫిర్యాదులు రాగా 184 ఫిర్యాదుల పరిష్కారం పూర్తయిందన్నారు. ఎన్‌జీఎస్‌పీ ద్వారా 347 ఫిర్యాదులు రాగా అన్ని ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. అదే విధంగా వాట్సాప్ నంబరు (9154970454) ద్వారా 27 ఫిర్యాదులు రాగా 27 ఫిర్యాదులు, కాల్ సెంటర్ (0866-2570051) ద్వారా 22 ఫిర్యాదులు రాగా 22 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎంఎస్) ద్వారా 50 ఫిర్యాదులు రాగా 45 ఫిర్యాదులను, సీఈవో మెయిల్స్ ద్వారా 13 ఫిర్యాదులు రాగా 10 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. సీ-విజిల్ యాప్ ద్వారా 451 ఫిర్యాదులు రాగా వాటిని క్షుణ్నంగా పరిశీలించి అన్నింటిని పరిష్కరించినట్లు వెల్లడించారు.

తిరువూరు నియోజకవర్గానికి సంబంధించి 55 సీ-విజిల్ ఫిర్యాదులురాగా.. విజయవాడ పశ్చిమకు సంబంధించి 6, విజయవాడ సెంట్రల్‌కు సంబంధించి 58, విజయవాడ తూర్పునకు సంబంధించి 73, మైలవరంకు సంబంధించి 18, నందిగామకు సంబంధించి 134, జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించి 103 ఫిర్యాదులు, ఇతర పోలింగ్ స్టేషన్ల పరిధి నుంచి 4 ఫిర్యాదులు వచ్చినట్లు వివరించారు. 60 ప్రతికూల వార్తలకు సంబంధించి 56 అంశాలపై తగిన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ప్రతి ఫిర్యాదుపైనా ప్రత్యేకంగా దృష్టిసారించి నాణ్యతతో పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ డిల్లీరావు తెలిపారు.



## ఈద్గాలో నిర్వాహకుల అత్యుత్సాహం

### ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ దక్కని ముస్లిం సోదరులు

### కనీస వసతులు శూన్యం

నందిగామ ఏప్రిల్ 11 మేజర్ న్యూస్ : కఠోర ఉపవాసాల అనంతరం పవిత్ర రంజాన్ మాసపు ముగింపు తో రంజాన్ పండగ నాడు యావత్ ప్రపంచ ముస్లిం సోదరులు ఈద్గాలో అత్యంత పవిత్రంగా ఈద్-ఉల్-ఫితర్ నమాజు చేసుకుంటారు. ఈ నమాజ్ యొక్క ప్రధాన ఉద్దేశం దైవ సన్నిధిలో పండగ నాడు అందరూ ఏకమై నమాజు చేసుకుని, పరస్పరం ఆలింగనంతో పండగ శుభాకాంక్షలు తెలియజేసుకోవటం. నమాజ్ సమయంలో అల్లాహ్ కు ప్రపంచ మానవాళి శాంతికి ప్రార్థనలు చేస్తారు.నందిగామ ఈద్గాలో జరిగే ఈదుల్ ఫితర్ నమాజ్ కి పట్టణ ముస్లిం సోదరులే కాకుండా పరిసర గ్రామాల నుండి కూడా ముస్లిం సోదరులు హాజరవుతూ ఉంటారు.ఇలాంటి ఎన్నో ప్రత్యేకతలు కలిగిన ఈదుల్ ఫితర్ నమాజ్ ముస్లిం సోదరులకు దక్కలేదు. నిర్వాహకుల ధోరణి వలన పట్టణంలో పలు విమర్శలకు తావునిచ్చింది.ఈద్గాలో ఈద్-ఉల్-ఫితర్ కి నమాజ్ ఖచ్చితంగా ఉదయం 8 గంటలకు జరుపుకుంటారని ప్రకటించి పట్టణంలో ముందు రోజు ప్రచారం చేశారు.ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈదుల్ ఫితర్ నమాజ్ కు వేలాదిగా తరలివచ్చారు. ముస్లిం సోదరులు.ముందు వెనుక చూసుకోకుండా కనీసం 10 నిమిషాలు కూడా వేచి చూడకుండా ముస్లిం సోదరులు వస్తున్న కూడా సమయం అయిందని ప్రారంభించేయడంతో వందలాదిగా ముస్లిం సోదరులకు ఈదుల్ ఫితర్ ను నమాజు ప్రాప్తం దక్కలేదు. ఇది ఒక రకంగా ముస్లింల మనోభావాలు దెబ్బతీసి,వారిని తీవ్ర మానసిక వేదనకు గురిచేసినట్లే అని వాపోయారు. ఇస్లాంలో సైతం అందరిని కలుపుకొని వెళ్లాలని, సమయం ముఖ్యం కాదు, ప్రతివారు నమాజ్ లో పాల్గొనడం ముఖ్యమని ఉందని, దానిని విస్మరించి ఇలా చేయడం భావ్యం కాదని ఆవేదన చెందారు. అత్యంత పవిత్రంగా భావించే నమాజ్ అందుకోకపోవడంతో పండగ రోజు పడ్డవేదన వర్ణనాతీతం. చివరికి కనీస వసతులు కల్పించలేకపోయారని విమర్శలు వెల్లు వెత్తాయి.

### డీవీఆర్ కాలనీలో పోలీసు వారి అవగాహన సదస్సు



నందిగామ ఏప్రిల్ 11 మేజర్ న్యూస్: రానున్న ఎన్.టి.ఆర్.జిల్లా 2024 సం. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం సాయంత్రం నందిగామ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ జె ఆర్ కె హనీష్ దేవినేని వెంకటరమణ కాలనీవాసులకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును వినియోగించుకొనుటకు నిర్భయముగా భయ,పక్షపాతాలు లేకుండా ఉండేందుకు గాను అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఎస్ ఐ పండుదోర మరియు సిబ్బంది పాల్గొన్నారు.

### బీజేపీలో చేరిన పైలా సామినాయుడు

విజయవాడ మేజర్ న్యూస్: విజయవాడ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, దుర్గ గుడి మాజీ చైర్మన్ పైలా సామినాయుడు గురువారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. విజయవాడ భవానిపురం బీజేపీ ఎన్నికల కార్యాలయంలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజక వర్గ బీజేపీ అభ్యర్థి యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీలో చేరిన అనంతరం పైలా ప్రసంగిస్తూ సిఎం అపాయింట్ మెంట్ కోసం నెలల తరబడి వేచి ఉన్నా అపాయింట్ మెంట్ లభించక పోవడం తనకు మనస్తాపం కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే గాక దుర్గ గుడి చైర్మన్ గా తనకు పొడిగింపు లభించక పోవడం వెనుక ఎమ్మెల్యే వెలంప ల్లి హస్తం ఉందని ఆరోపించారు. పశ్చిమ నియోజక వర్గంలోని 22 డివిజన్లలో పర్యటించి అన్ని వర్గాల ప్రజలును కలసి సుజనా చౌదరి విజయానికి సహకరిస్తానని కార్యకర్తల హర్షధ్వానాల మధ్య పైలా ప్రకటించారు. ఈ సందర్భంగా పైలా తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని సోదాహరణంగా వివరించారు. బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డురి శ్రీ రాం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అమ్మి శెట్టి వాసు, బాడిత శంకర్, రజనీ, బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### పార్లమెంట్ స్థానాలకు ఎన్నికల సమన్వయకర్తల నియామకం

విజయవాడ మేజర్ న్యూస్: అమలాపురం, విజయవాడ పార్లమెంటు స్థానాల పరిధిలో జనసేన పార్టీ తరపున ఎన్నికల సమన్వయం కోసం సమన్వయకర్తలను పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నియమించారు. అమలాపురానికి మాజీ మంత్రి, సీనియర్ నాయకులు కొత్తపల్లి సుబ్బారాయుడు, విజయవాడకు అమ్మిశెట్టి వాసు సమన్వయకర్తలు గా నియమితులయ్యారు. మిత్ర పక్షాల విజయం కోసం వీరు కృషి చేస్తారు.



## కరుణకు, దాతృత్వానికి ప్రతీక.. రంజాన్ : సామినేని

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 11, మేజర్ న్యూస్:** రంజాన్ పండుగ సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వమానవ సమానత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక అని, ప్రజలందరికీ శుభ సంతోషాలు కలగాలని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానుఅన్నారు.బలుసుపాడు రోడ్డు ఈద్గాలో జరిగిన రంజాన్ ప్రార్ధనలో ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. అనంతరం ముస్లిం మత పెద్దలకు, సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు



**నందిగామ, ఏప్రిల్ 11, మేజర్ న్యూస్ :** పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ లు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెల్సీలు మాట్లాడుతూ అల్లాహ్ దీవెనలతో నందిగామ నియోజకవర్గ ప్రజలకు. ముస్లిం సోదరులకు సకల శుభాలు కలగాలి.ముస్లిం సోదర, సోదరీమణులకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేశారు.దీక్షలు, ఉపవాసాలు, దైవారాధన, దానధర్మాలు, చెడును త్యజించడం, సాటి మానవులకు సేవ వంటి సత్కార్యాల ద్వారా రంజాన్ మాసం అంతా ముస్లింలు అల్లాహ్ స్మరణలో లీనమై ఉంటారు.మానవాళికి హితాన్ని బోధించే రంజాన్ పండుగ... సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వ మానవ సమత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక అన్నారు.అనంతరం పెద్ద మసీదులోని దర్గాలో ముస్లిం మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మానవీయ విలువలకు అద్దం పట్టే రంజాన్ : మాజీ ఎమ్మెల్యే సౌమ్య



**నందిగామ, ఏప్రిల్ 11, మేజర్ న్యూస్:**పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా ఈద్-ఉల్-ఫితర్‌ను పురస్కరించుకుని ముస్లిం సమాజానికి ఎన్డీయే కూటమి ఉమ్మడి అభ్యర్థి తంగిరాల సౌమ్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ ఖురాన్ బోధనల ప్రభావం సమాజంపై ఎంతగానో ఉంటుందని, రంజాన్ మాసంలో చేపట్టిన ఉపవాస దీక్షలు స్వీయ క్రమశిక్షణ, జీవితంపట్ల సానకూల దృక్పథాన్ని కలిగిస్తాయన్నారు.నందిగామ పట్టణంలో ఈద్గా పెద్ద మసీద్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేసి మిఠాయిలు పంచారు.అన్ని సేవలకు మించి మానవసేవ అత్యున్నమైనదని చాటి చెప్పే రంజాన్ లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీక అన్నారు.పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దానధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రంజాన్ వేడుకలు

## ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనల్లో వైసీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** రంజాన్ నెల విశ్వాసి పాలిట వరాల వసంతం వంటిదని, గొప్ప శుభాలతో కూడిన పవిత్ర రంజాన్ మాసం మొదటి భాగం కారుణ్యంతో కూడినదని, మధ్య భాగం మన్నింపు సంబంధించిందని, మూడవ భాగం నరకం నుంచి విముక్తి కల్గించేదని అల్లా కారుణ్యం కోసం అలుపెరగని ప్రార్థనలతో శ్రమించేవారు ఎంతో అదృష్టవంతులని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మచిలీపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) యావత్ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఉదయం ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ తో కలిసి మచిలీపట్నం ఉల్లింగిపాలెం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. చిన్నాపెద్దలు పరస్పరం ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా సింహాద్రి చంద్రశేఖర్, పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మాట్లాడుతూ,భక్తి, విశ్వాసాలకు కఠిన ఉపవాస దీక్షలకు నెలవైన పండుగ ముస్లింలలో అంచెలంచెల భక్తి భావాన్ని, ఆత్మ విశ్వాసాన్ని నింపుతుందన్నారు. పవిత్ర ఖురాన్ ఆవిర్భవించిన గొప్ప మాసం రంజాన్ అని అన్నారు.

జకాత్, పిత్ర వంటి దానధర్మాలకు ప్రతీకగా భావించే ముస్లింలు రంజాన్ నెల మాసం ఉపవాస దీక్షలతో ప్రత్యేక ప్రార్థనలతో గడుపుతారన్నారు. ఉపవాసాలు ముగిసిన తరువాత షవ్వాల్, చంద్రదర్శనం అనంతరం రంజాన్ పండుగను జరుపుకుంటారన్నారు. ఆకాశాన నెలవంక కనబడగానే నెల రోజుల ఉపవాస దీక్ష ముగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సలార్ దాదా, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ అచ్చేబా, కార్పొరేటర్లు, ఇంచార్జులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 11, మేజర్ న్యూస్:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట టిడిపి బిజెపి జనసేన ఉమ్మడి అభ్యర్థి శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య నివాసంలో ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం రఘురాం, శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరామ్ సుబ్బారావు, యువ నాయకులు శ్రీరామ్ చిన్నబాబు లను ముస్లిం సోదరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు టిడిపి నాయకులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరుణులకు రంజాన్ శుభాకాంక్షలు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ముస్లిం సోదర, సోదరీమణులకు కొల్లు రవీంద్ర, బాలశౌరి, బండి రామకృష్ణ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఈద్ ఉల్ ఫితర్ వేడుకలను మచిలీపట్నంలోని ముస్లింలందరూ ఆనందంగా జరుపుకొని అల్లా దీవెనలను అందుకోవాలని ఆకాంక్షించారు. నెల రోజుల కఠిన ఉపవాస దీక్షల అనంతరం జరుపుకునే రంజాన్ పండుగను ముస్లింలు తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులందరితో ఇంటిల్లిపాది సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని సేవలకు మించి మానవ సేవ అత్యున్నతమైనదని చాటి చెప్పే రంజాన్ పండుగ లౌకిక వాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు.

# భక్తిశ్రద్ధలతో పవిత్ర రంజాన్

**నందిగామ, ఏప్రిల్ 11, మేజర్ న్యూస్:** పట్టణంలో అశోక్ నగర్ లో రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గాలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక (నమాజు ) ప్రార్థనలు నిర్వహించారు.నెల రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు పాటించిన ముస్లింలు ఇక దీక్షలు చేసి విరమించారు. ఈద్గాలో ఉదయం 8 గంటలకే నమాజ్ ను ప్రారంభించారు. ఈద్గాలో మత గురువు (హాఫిజ్ సాబ్ సాదిక్ )ఖురాన్ పఠనం చేసి నమాజ్ చదివించి ముస్లింలు తమ విశ్వాసాన్ని బలపరుచుకోవడానికి దేవునితో తమ సంబంధాన్ని మరింతగా పెంచుకోవడానికి నమాజ్ చేయాలని పిలుపునిచ్చారు., ఇతరుల పట్ల సోదర భావంతో మెలగాలని, ఇతరుల పట్ల సానుభూతి, కరుణను పెంపొందించే విధంగాఉండాలని తెలిపారు. సమస్త మానవాళి సుఖ సంతోషాలతో అందరూ కలిసిమెలిసి ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలకు ఈద్-ఉల్-ఫితర్ తెలుపుతూ ఒకరిని ఒకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ అలింగణం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో



పెద్ద మసీదు మత గురువులు, చిన్న మసీదు మత గురువులు, రమణ కాలనీ ఉమా కాలనీ మత్త గురువులు నందిగామ ముస్లిం సోదరులు యువత నమాజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఈద్గా వద్ద నందిగామ ఎమ్మెల్యే జగన్మోహన్రావు ముస్లింలకు ప్రత్యేకంగా కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం కూటమి అభ్యర్థి తంగిరాల సౌమ్య ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు ప్రత్యేక రంజాన్ శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంచి పెట్టారు.ఈ నమాజ్ కార్యక్రమానికి నందిగామ ఏసిపి రవికిరణ్,సీఐ హనీష్ ఆధ్వర్యంలోఈద్గా వద్ద నందిగామ పోలీస్ సిబ్బంది భద్రతను నిర్వహించారు.ఎస్ఐ పండు దొర, ట్రాఫిక్ ఎస్ఐ విజయ్ సుందర్ ట్రాఫిక్ సమస్యను నియంత్రించి ముస్లిం సోదరులకు పోలీసులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



# పూలే ఆశయ సాధనలో ముందుకు పోదాం



**జగ్గయ్యపేట, ఏప్రిల్ 11, మేజర్ న్యూస్:** సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన నవయుగ వైతాళికుడు సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే ఆశయ సాధనలో మనం అంతా ముందుకు వెళ్లామని ప్రభుత్వవిప్,శాసనసభ్యులు సామినేని ఉదయభాను అన్నారు.మహాత్మా జ్యోతిరావు పులే జయంతి వేడుకలు పట్టణంలోని ఘనంగా నిర్వహించారు. విజయవాడ రోడ్డు కమల సెంటర్‌లో పూలే విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను బీసీ నాయకులతో కలిసి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అభివృద్ధికి నిరంతరం కృషిచేసి వారి పురోభివృద్ధికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తి పూలే అని ఆయన అడుగుజాడల్లో మనందరం నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి

### నివాళులర్పించిన టీడీపీ కూటమి శ్రేణులు



**మైలవరం, మేజర్ న్యూస్ :** మైలవరం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వ హించారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు మాట్లా డుతూ మహాత్మా జ్యోతిరావు పూలే ఏప్రిల్ 11, 1827న భారతదేశంలోని మహారాష్ట్రలో జన్మించారు. ఆయన సామాజిక సంస్కర్త, ఆలోచనాపరుడు, కార్యకర్త, కుల ఆధారిత వివక్షను నిర్మూలించడానికి, విద్య, సామాజిక సమానత్వాన్ని ప్రోత్సహించడానికి తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. 1848లో ఆయన సతీమణి సావిత్రీబాయి పూలేతో కలిసి మహిళల విద్యపై విస్తృతంగా ఉన్న వ్యతిరేకతను ధిక్కరిస్తూ భారతదేశంలో మొదటి మహిళా పాఠశాలను స్థాపించారు. లింగ, కుల ఆధారిత సామాజిక అన్యాయాలను తొలగించడానికి అంకితమైన సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించారన్నారు. దివంగత పూలే కుల వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించారు. అట్టడుగు కులాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేశారు. బలహీనుల హక్కులు ఆత్మగౌరవాన్ని రక్షించారు. సామాజిక సంస్కరణలు, విద్య పట్ల పూలే తిరుగులేని నిబద్ధత అణగారిన వర్గాల సాధికారతకు పునాది వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం మండల బీజేపీ, జనసేన, తెలుగుదేశం పార్టీ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ ధాతృత్వం ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం



**గన్నవరం, ఏప్రిల్ 11, మేజర్ న్యూస్ :** క్రమశిక్షణ ధాతృత్వం ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం అని ముస్తాబాద్ జామియా మస్జిద్ ఇమామ్ హసీన్ ఇక్బాల్ గురువారం ముస్తాబాద్ ఈద్గాలో జరిగిన ఈద్-ఉల్-ఫితర్ ప్రత్యేక ప్రార్థనలతో సందేశం ఇచ్చారు. ప్రత్యేకంగా ఈ నెలలో దివ్య ఖురాన్ అవతరించిందని, ప్రతి ఒక్క ముస్లిం తనకున్నంతలో ఈద్ నమాజ్ కు ముందు ఫిత్ర, జకాత్ రూపంలో దానధర్మాలు చేయాలని సూచించారు. ఈ ప్రత్యేక ప్రార్థనలకు వచ్చేటప్పుడు అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్. లాఇలాహ ఇల్లల్లాహ్ వాల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్ వాలిల్లాహిల్హమద్ అని తద్బీర్ చదువుతూ రావాలని అన్నారు. ప్రత్యేక ప్రార్థనల యందు ముస్తాబాద్ సూరంపల్లి, సూరంపల్లి ఇండస్ట్రియల్ ఏరియా, సావారిగూడెం, పురుషోత్తపట్నం, కొండపావులూరు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

## గొప్ప సాంఘిక సంస్కర్త.. మహాత్మ జ్యోతిరావు పూలే

### జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** సాంఘిక సంస్కర్తగా మహాత్మ జ్యోతిరావు పూలే చేసిన సేవలు చాలా గొప్పవని.. మహిళల విద్య, సామాజిక న్యాయం కోసం ఆయన ఎనలేని కృషి చేశారని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ డిల్లీరావు.. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలలు అలంకరించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దోపిడీ, అణచివేత, వివక్షతలను ఎదుర్కొనేందుకు బడుగు బలహీన వర్గాలకు చదువు ముఖ్యమని భావించి.. విద్యను చిత్తశుద్ధితో మనోధైర్యంతో శ్రద్ధతో అభ్యసించి, ఉన్నతంగా ఎదగాలని సమాజానికి చాటిచెప్పి అందులో విజయం సాధించిన మహనీయులు జ్యోతిరావు పూలే అని పేర్కొన్నారు. ప్రజలకు సాంఘిక న్యాయం, సమాన హక్కుల కోసం సత్యశోధక సమాజాన్ని స్థాపించి చైతన్యం తెచ్చి, విశేష సేవలు అందించారని కలెక్టర్ డిల్లీరావు అన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సతీసహగమనాన్ని వ్యతిరేకించిన వ్యక్తి జ్యోతిరావుపూలే




**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** సతీసహగమనాన్ని, స్త్రీ శిరోముండనాన్ని వ్యతిరేకించిన మొట్టమొదటిభారతీయుడు జ్యోతిరావుపూలే అని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్ ఆవరణలో గల జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డి.కె బాలాజీ మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మార్పుకు స్త్రీవిద్య అవసరంఅని గుర్తించి, వారికోసం పాఠశాలలు నిర్మించి, మహిళల హక్కుల కోసం పోరాడటమే కాకుండా, శూద్రులు, అగ్రవర్ణాల వారి దోపిడీకి గురికాకుండా సమ సమాజ స్థాపనకు పిలుపునిచ్చిన గొప్ప వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అన్నారు. సామాజిక ఆర్థిక అసమానతలను రూపుమాపటానికి "సత్యశోధక్ సమాజ్" ను స్థాపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి జి రమేష్, జిల్లా దివ్యాంగుల సంక్షేమ వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కామరాజు, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య, హాస్టల్ సంక్షేమ అధికారులు, సంక్షేమ శాఖల కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## వలంద పాలెంలో పూలే విగ్రహంకు ఘన నివాళి



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** బీసీ విముక్తి ప్రదాత, ఆధునిక భారత సామాజిక విప్లవోద్యమ పితామహులు రాష్ట్రపిత జోతిబా పూలే 196వ జయంతి సందర్భంగా మచిలీపట్నం నియోజకవర్గం వలంద పాలెంలో పూలే విగ్రహంకు పూలమాలవేసి నివాళులర్పించిన మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలసౌరి, మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణ రావు, జనసేన ఇన్చార్జి బండి రామకృష్ణ, తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు.

## ఈడేపల్లి బీ.సీ సంక్షేమ సంఘ కార్యాలయంలో..



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** జ్యోతిరావు పూలే 198వ జయంతిని గురువారం స్థానిక ఈడేపల్లి బీ.సీ సంక్షేమ సంఘ కార్యాలయంలో బి.సి. నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు శేకుబోయిన సుబ్రమణ్యం మాట్లాడుతూ సంఘ సంస్కర్త, రచయిత, సమానత్వం కోసం పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. సామాజిక మార్పుకు స్త్రీ విద్య ఆవశ్యకతను గుర్తించి, వారికోసం పాఠశాలలు నిర్మించారని తెలిపారు. మహిళల హక్కుల కోసం పోరాడారని తెలియజేశారు. శూద్రులు, అగ్ర వర్ణాల వారి వివక్షకు గురికాకుండా సమసమాజ స్థాపనకు పిలుపునిచ్చిన ఉద్యమ కారుడని అభివర్ణించారు. సామాజిక ఆర్థిక అసమానతలను రూపుమాపడానికి సత్యశోధక సమాజ్ ను స్థాపించారని తెలిపారు. సతీ సహగమనం, స్త్రీ శిరోముండనాన్ని వ్యతిరేకించిన మహాత్ముడని శేకుబోయిన కొనియాడారు. అనంతరం జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకి బీ.సీ నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నిక్కు రాధాకృష్ణ,జన్ను గోవిందు,బోయిన రమేష్, పవన్, బి. వెంకటస్వామి తదితర బీ.సీ నాయకులు పాల్గొన్నారు.

## కొండపల్లిలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



**మైలవరం, మేజర్ న్యూస్ :** కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొత్త గేటు ఏరియా నుంచి పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. మైలవరం తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సమక్షంలో పసుపు కండువాలు కప్పుకుని టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తన్నీరు రమాదేవి, గుంజా గౌరీ, గుంజా లక్ష్మి, దండుగుల లక్ష్మి, కంటా లింగమ్మ, సావిత్రి, టి.కుమారి, ఎల్ జానకి, ఎస్ కళ్యాణి, శోభ, తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. టిడిపి నాయకులు కోట్ల రాజు, వేముల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## తాతయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన వంగవీటి రాధా



**జగ్గయ్యపేట, ఏప్రిల్ 11, మేజర్ న్యూస్:** టీడీపీ జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తల్లి సక్కుబాయి గత నాలుగు రోజుల క్రితం పరమపదించారు. విషయం తెలుసుకుని పట్టణంలో శ్రీరాం తాతయ్య నివాసానికి వంగవీటి రాధా, బొమ్మసాని సుబ్బారావు విచ్చేసి సక్కు బాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. శ్రీరాం తాతయ్య కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# మానవాళికి హితాన్ని బోధించే పండుగ రంజాన్





## టీడీపీ ఎంపీ అభ్యర్ధి కేశినేని శివనాథ్ (చిన్ని)

## ఇందిరాగాంధీ స్టేడియంలో రంజాన్ పర్వదిన ప్రార్ధనలు

## ముస్లిం సోదరులతో కలిసి ప్రార్ధనల్లో పాల్గొన్న శివనాథ్

**విజయవాడ పశ్చిమ, మేజర్ న్యూస్ :** ముస్లిం సోదరులందరూ అల్లాకు దగ్గరయ్యే మాసం రంజాన్ పండుగ. రంజాన్ మాసంలో నెల రోజులపాటు చేసే ఉపవాస దీక్షల వల్ల క్రమశిక్షణ తో పాటు దైవభక్తి పరిఢవిల్లుతోందని బిజెపి, జనసేన బలపరిచిన విజయవాడ పార్లమెంట్ టిడిపి అభ్యర్ధి కేశినేని శివనాథ్ (చిన్ని) చెప్పారు. రంజాన్ పండుగ సందర్భంగా గురువారం ఇందిరా గాంధీ స్టేడియంలో ముస్లిం ఈద్గా కమిటీ నిర్వహించిన ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివనాథ్ ముస్లిం సోదరులకి రంజాన్ శుభాకాంక్షలు తెలియ చేయడంతో పాటు ముస్లిం సోదరుల ఇంట సుఖశాంతులు నింపాలని ఆకాంక్షించారు. మానవాళికి హితాన్ని బోధించే పండుగ రంజాన్ అన్నారు. అల్లా అనుగ్రహం ఎల్లవేళలా ప్రజలందరి పై ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫతావుల్లా, టిడిపి ముస్లిం నాయకులు ఇర్ఫాన్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## మానవీయ విలువలు పెంపొందించే పండుగ రంజాన్

### టీడీపీ ఎంపీ అభ్యర్ధి కేశినేని శివనాథ్ (చిన్ని)

### మోతీ మసీద్ ఈద్గాలో రంజాన్ పండుగ ప్రత్యేక ప్రార్ధనలు

### ప్రార్ధనల్లో పాల్గొన్న శివనాథ్, సుజనా చౌదరి

**విజయవాడ పశ్చిమ, మేజర్ న్యూస్ :** రంజాన్ మాసంలో చేసే ఉపవాస దీక్షలు జీవితం పట్ల సానుకూల దృక్పథం, సహనం, పరోపకారం, త్యాగం వంటి మానవీయ విలువలు పెంపొందిస్తాయి. రంజాన్ పండుగ అంటే ప్రేమ, దయ, సహనం, ఆనందం, సంతోషాల కలయిక అని బిజెపి, జనసేన బలపరిచిన విజయవాడ పార్లమెంట్ టిడిపి అభ్యర్ధి కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గం చిట్టినగర్ సెంటర్ లోని మోతీ మసీద్ ఈద్గాలో కేశినేని శివనాథ్, టిడిపి,జనసేన బలపరిచిన పశ్చిమనియోజక వర్గ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి తో కలిసి నమాజ్ తో పాటు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ ప్రార్ధనలలో టిడిపి అధికార ప్రతినిధి కె.నాగుల్ మీరా, టిడిపి నాయకులు ఎమ్.ఎస్.బేగ్, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా, రాష్ట్ర వాణిజ్య విభాగ అధ్యక్షుడు డూండీ రాకేష్ పాల్గొన్నారు. ప్రార్ధనల అనంతరం శివనాథ్ నాయకులతో పాటు ముస్లిం సోదరలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మసీద్ ఇమామ్ నజీర్ అహ్మద్



ని కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ అల్లా చల్లని దీవెనలు వుండాలని ప్రార్ధించినట్లుగా చెప్పారు. ముస్లిం సోదరులు ఈ రంజాన్ నాడు చేసే ప్రార్ధనలు సఫలం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, పశ్చిమ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ, టిడిపి నాయకులు నహీద్ అంజూమ్ తో పాటు స్థానిక టిడిపి, బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.



## వైసీపీ అసత్య ప్రచారాలను తిప్పి కొట్టండి

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టండి అని వల్లభనేని అనుదీప్ అన్నారు. బుధవారం రాత్రి అవనిగడ్డ నియోజకవర్గ జనసేన పార్టీ అభ్యర్ధి మండలి బుద్ధప్రసాద్ స్వగృహంలో సోషల్ మిడియా సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి మచిలీపట్న పార్లమెంట్ జనసేన అభ్యర్ధి వల్లభనేని బాలశౌరి కుమారుడు అనుదీప్ మాట్లాడారు. సోషల్ మిడియాలో వైసిపి చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టి కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు కృషి చేయాలని అనుదీప్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక పోకడులను అరికట్టాలని జనసేన టిడిపి పార్టీలపై వైసిపి పెటియం బ్యాచ్ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని, నియోజకవర్గంలోని సమస్యలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత ప్రజలకు ఇచ్చే పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళాలని కోరారు.రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం ఘోర పరాభవం పొందుతుందని, దానిని తట్టుకోలేక జనసేన, టిడిపి నేతలపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో గడిచిన 5 సంవత్సరాలుగా ఏదైనా అభివృద్ధి జరిగింది అంటే అది కేవలం మచిలీపట్నం ఎం.పి బాలశౌరి వల్ల మాత్రమే జరిగిందన్నారు. శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాడిన తరువాత అవనిగడ్డ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి అంటూ ప్రతి ఒక్కరూ వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ అసెంబ్లీ అభ్యర్ధి మండలి బుద్ధప్రసాద్‌లకు గ్లాసు గుర్తుపై ఓటు వేసి అఖండ మేజారిటీ చేకూర్చాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్ధి తనయుడు మండలి వెంకట్రామ్, జనసేన పార్టీ అవనిగడ్డ మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు, జనసేన పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ ఐటి కో ఆర్డినేటర్ సుదాని నందగోపాల్, జనసేన కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సామాజిక విప్లవమూర్తి జ్యోతిరావు పులే..



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** బహుజన విముక్తి ప్రధాత మహాత్మా జ్యోతిరావు పులే జయంతిని వైసిపి ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం మహాత్మా జ్యోతిరావు పులే 197 వ జయంతిని పురస్కరించుకుని శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు తన కార్యాలయంలో జ్యోతిరావు పులే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించి మాట్లాడారు. నాడు బడుగు బలహీన వర్గాలను, బహుజనులుగా సంఘటితం చేసిన సామాజిక న్యాయ దర్శనికుడు, సామాజిక విప్లవమూర్తి ఆధునిక యుగంలో కుల నిర్మూలన ఉద్యమాలకు భీజం నాటిన సామాజికోత్యమ, చైతన్య జ్వాల జ్యోతిరావు పులే అన్నారు. మహారాష్ట్రలోని పూనెకు సమీపంలో ఉన్న సరారాలో 1827 ఏప్రిల్ 11 వ తేదిన పులే జన్మించారన్నారు. 1990 నవంబర్ 28 న శాశ్వతంగా పులే విశ్రమించారని, పులే భారత సామాజిక విప్లవ పితామహునిగా బహుజన విముక్తి ఉద్యమ వేగుచుక్కగా చిరకాలం చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.పి తుంగల సుమతీదేవి, జడ్.పి.టి.సి చింతలపూడీ లక్ష్మీనారాయణ, ఎస్ సి సెల్ రాష్ట్ర నాయకులు నలుకుర్తి రమేష్, వైస్ ఎం.పి.పి పులిగడ్డ పిచ్చేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ సభ్యుడు బాల, పాత ఎడ్లంక మాజీ సర్పంచ్ సైకం బాబూరావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులు ఉన్నత స్థానానికి చేరుకోవాలి

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** అల్పాదాయ వర్గాలకు చెందిన ముస్లిం సోదరులు ఉన్నత స్థానానికి చేరుకోవాలని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ కోరారు. గురువారం రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లీం సోదరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హిందు, ముస్లీం సమైక్యతకు అవనిగడ్డ ప్రతీక అన్నారు. ముస్లీంలు, హిందువులు మతాతీత భావనతో ఎలాంటి తారతమ్యాలు లేకుండా రెచ్చగొట్టేవారిని పట్టించుకోకుండా సమైఖ్యంగా ముందుకు సాగాలన్నారు. అవనిగడ్డలో మసీదు అభివృద్ధి, విస్తరణ పనులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని మండలి హామీ ఇచ్చారు. అవనిగడ్డలో ముస్లీంల చిరకాల వాంఛగా ఉన్న ఈద్ఘా హే ఏర్పాటు



కోసం అనువైన స్థలం ఎంపిక చేసి, కేటాయించి అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అవనిగడ్డ మసీదు నిర్మాణానికి అప్పట్లో నిజాం నవాబు ముని మనువడు మూర్తాంజా విరాళం ఇవ్వడంతో పాటు అవనిగడ్డ వచ్చి మసీదు సందర్శించారని మండలి అన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో ముస్లీంల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఆయనతో పాటుగా తెలుగుదేశం పార్టీ అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, అవనిగడ్డ జనసేన పార్టీ మండలి అధ్యక్షులు గుడివాక శేషుబాబు, ఎం.పి.టి.సి బొప్పన బాణు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ నాయకులు షేక్ బాబావలి, మహ్మద్ మురాబ్, వహీదుల్లా, మొగల్ హుస్సేన్ మాజీ ఉపసర్పంచ్ ఘంటశాల కన్నయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# వైసీపీ రాజీనామా చేసే ఆలోచనలో పట్టణ వైసీపీ అధ్యక్షులు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుగా అన్నపరెడ్డి రామదాసు ఆ పార్టీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరేందుకు సమాయత్తం అయ్యారు. జనసేన పార్టీ మచిలీపట్నం ఉమ్మడి పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి కుమారుడు అనుదీప్ జనసేన పార్టీ అవనిగడ్డ అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ తెలుగుదేశం, జనసేన మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, గుడివాక శేషుబాబుల ఆద్వర్యంలో అవనిగడ్డ పట్టణ పార్టీ అధ్యక్షులు, లంకమ్మ అమ్మవారి దేవస్థాన పాలక మండలి ఛైర్మన్ అన్నపరెడ్డి రామదాసు, పసుపులేని సత్యకిరణ్ మిత్ర బృందం ఆద్వర్యంలో బుధవారం రాత్రి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి విచ్చేసిన అతిధులకు పెద్దలు, యువత సాధర స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా విచ్చేసిన నాయకులతో పెద్దలు, స్థానికంగా ఉన్న సమస్యలు, యువత నిరుద్యోగంపై మాట్లాడారు. వారి మాటలకు నాయకులు బదులిస్తూ అధికారంలోనికి వచ్చిన వెంటనే స్థానికంగా ఉన్న సమస్యలు, యువత నిరుద్యోగ సమస్యలను పరిష్కరించి ఎల్లప్పుడు అందుబాటులో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పెద్దలు, యువత జనసేన పార్టీకి అండగా ఉంటామని వల్లభనేని, మండలి విజయానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



## వైసీపీని ఓడిద్దాం..అమరావతిని నిర్మిద్దాం

**దళితబహుజన ఫ్రంట్, కాపునాడు నాయకుల పిలుపు**

**విజయవాడ మేజర్ న్యూస్ :** వైసీపీని ఓడిద్దాం.. అమరావతిని నిర్మిద్దామని దళిత బహుజన ఫ్రంట్, కాపునాడు నాయకులు పిలుపునిచ్చారు. ఆ మేరకు విజయవాడలోని కాపునాడు కార్యాలయంలో కరపత్రం ఆవిష్కరించారు. సీఎం జగన్‌కు ఓటు అడిగే హక్కు లేదని దళిత బహుజన ఫ్రంట్ నాయకులు విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని దళిత, బహుజనులకి తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం దళితులు, బహుజనులకు ఇచ్చిన 27 పథకాలను జగన్ సర్కారు రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు నవరత్నాలకు మళ్లించడం అన్యాయమన్నారు. విదేశీ విద్యకి అంబేద్కర్ పేరు తొలగించి జగన్ పేరు పెట్టుకోవడం ఏంటని దళిత బహుజన, కాపునాడు నేతలు ప్రశ్నించారు. హత్యలు చేసిన వారికి సైతం జగన్ ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారని దుయ్యబట్టారు.

## అంజుమన్- యి- హిమాయతుల్ ఇస్లాం ఈద్గాలో లోకేష్ రంజాన్ ప్రార్ధనలు

**ముస్లిం సోదరులకు యువనేత శుభాకాంక్షలు**







**విజయవాడ మేజర్ న్యూస్ :** ఈద్-ఉల్-ఫితర్ పర్వదినాన్ని పురస్కరించుకొని యువనేత నారా లోకేష్ మంగళగిరి అంజుమన్- యి- హిమాయతుల్ ఇస్లాం ఈద్గాను సందర్శించారు. ముస్లింసోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన యువనేత వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈద్గా వద్ద యువనేతకు ఘనస్వాగతం లభించింది. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ పర్వదినాలు. దివ్య ఖురాన్ ఆవిర్భవించింది ఈ మాసంలోనే. మహ్మద్ ప్రవక్త లా ఇల్లాహ ఇల్లల్ల అనే సూత్రం ప్రకారం మానవులను కష్టాల నుంచి కాపాడేది రంజాన్ మాసం. అల్లా దయతో ఈ ఏడాది రాష్ట్ర ప్రజానీకానికి కష్టాల నుంచి విముక్తి కలగాలని లోకేష్ ఆకాంక్షించారు.

## టీడీపీలో చేరిన జగన్ సన్నిహితుడు

**నారా లోకేష్ సమక్షంలో పార్టీలో చేరిక**



**విజయవాడ మేజర్ న్యూస్ :** మంగళగిరిని దేశంలోనే నెం.1గా తీర్చిదిద్దాలన్న యువనేత నారా లోకేష్ సంకల్పానికి నియోజకవర్గ ప్రజలనుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. లోకేష్ నినాదానికి ఆకర్షితులైన వివిధ పార్టీల నేతలు యువనేత సమక్షంలో తెలుగు దేశం పార్టీలో చేరుతున్నారు. తాజాగా ముఖ్యమంత్రి జగన్ సన్నిహితుడు, మంగళగిరి రూరల్ మండలం కురగల్లు గ్రామానికి చెందిన ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు కట్టెపోగు బసవరావు ఆధ్వర్యంలో 10మంది టిడిపిలో చేరారు. జగన్ కు సంఘీభావంగా ఇడుపులపాయ నుంచి విశాఖపట్నం వరకు బసవరావు 2వేల కి.మీ.లు పాదయాత్ర చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక జగన్ విధానాలతో విభేదించి ఎస్సీ కమిషన్ సభ్యత్వానికి రాజీనామా చేశారు. చంద్రబాబు నేతృత్వంలో దళితుల అభివృద్ధి సాధ్యమని నమ్మి తాము టిడిపిలో



చేరుతున్నట్లు చెప్పారు. వీరితో పాటు తాడేపల్లి రూరల్ ఉండవల్లి గ్రామానికి చెందిన లంకా భువన శేషగిరి చరణ్, కే.ఫణిశర్మ ఆధ్వర్యంలో 20 మంది పార్టీలో చేరారు. వీరందరికీ లోకేష్ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ ఎస్సీల కోసం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 27 సంక్షేమ పథకాలను రద్దుచేసిన దళిత ద్రోహి జగన్ అని దుయ్యబట్టారు. జగన్ పాలనలో 188 దళితులను ఊచకోత కోశారు. దళితులను చంపిన డోర్ డెలివరీ చేసిన అనంతబాబు లాంటి వారిని పక్కనబెట్టుకున్నారు. ప్రతిరోజూ రాష్ట్రంలో ఏదో మూల దళితులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక దళితులకు పూర్తి రక్షణ కల్పిస్తామని, దళితులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ హయాంలో దళితులకు అమలుచేసిన సంక్షేమ పథకాలన్నీ పునరుద్ధరిస్తామని చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్ ను బలోపేతం స్వయం ఉపాధి రుణాలు అందజేస్తామని లోకేష్ పేర్కొన్నారు.

## 14న తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారంభం

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఈ నెల 14 వ తేది ఆదివారం అవనిగడ్డలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్నట్లు అవనిగడ్డ తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యాలయాన్ని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు ప్రారంభిస్తారన్నారు. అవనిగడ్డ పంచాయితీ కార్యాలయం ప్రక్కన గతంలో దివంగత శాసనసభ్యులు అంబటి బ్రాహ్మణయ్య తన కార్యాలయంగా ఉపయోగించిన కార్యాలయాన్ని కొనకళ్ళ నారాయణ ఆదేశాలతో నియోజకవర్గ కార్యాలయంగా ఎంపిక చేయడం జరిగిందని,ఈ కార్యాలయ ప్రారంభోత్సవానికి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నేతలంతా హాజరు కావాలని చిట్టిబాబు కోరారు.



## ప్రతిష్ఠా మహోత్సవాలకు ఆహ్వాన పత్రికలు

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** గీతామందిరంలో ఈ నెల 22 వ తేది ప్రతిష్ఠా మహోత్సవాలకు ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ నెల 19 నుండి మూడు రోజుల పాటు నిర్వహించనున్న విమాన శిఖరములు, జీవ ధ్వజ ప్రతిష్ఠా మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను గురువారం గీతామందిర ఆవరణలో మందిర కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు దంపతులు ముఖ్య అతిధిగా పాల్గొనే కార్యక్రమంలో భాగంగా 19 వ తేది శుక్రవారం వాస్తు హోమం 22 వ తేది శనివారం ఉదయం అగ్ని మదనం, 21 వ తేది ఆదివారం 10 గంటలకు విమాన శిఖరం ధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు జరుగుతాయన్నారు. అనంతరం స్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని, ఆవిష్కరణ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ యర్రంశెట్టి శ్రీహరిబాబు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భోగాది రాము, సభ్యులు కె వెంకట సుబ్బారావు, సీతారామకృష్ణ, భోగాది చంద్రశేఖర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పంట కాలువలకు త్రాగు నీరు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** పంట కాలువలకు త్రాగు నీరు విడుదల చేయడంతో బుధవారం సాయంత్రం అవనిగడ్డకు పంట కాలువ ద్వారా త్రాగు నీరు చేరుకుంది. మోటర్లు, చమురు యంత్రాల ద్వారా త్రాగు నీటితో చెరువులు నింపేందుకు పంచాయితీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు సర్పంచ్ గొరుముచ్చు ఉమా ఆద్వర్యంలో 2 మోటర్లు, 1 చమురు యంత్రాన్ని ఏర్పాటు చేసి చెరువు నింపే పనిలో నిమగ్నమయ్యారు. దివిసీమలోని పంచాయితీ కార్యదర్శులందరూ త్రాగు నీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపుకోవాలని ఇప్పటికే ఉన్నత అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాలువల ద్వారా వస్తున్న త్రాగు నీటిని చేపలు, రొయ్యల చెరువులకు తరలించకూడదని, ఆవిధంగా తరలించేవారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు సైతం జారీ చేశారు.

## మీనాక్షి కన్స్ట్రక్షన్స్ అధినేత పెద్ది రమేష్ సేవలు మార్గదర్శకం



**విజయవాడ పశ్చిమ మేజర్ న్యూస్ :** వేసవిలో పాదచారుల దాహార్తిని తీరుస్తున్న మీనాక్షి కన్స్ట్రక్షన్స్ అధినేత పెద్ది రమేష్ సేవలు ఎంతో మార్గదర్శకమని విజయవాడ వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏ సి పీ జనార్ధ రావు అన్నారు. కాళేశ్వరరావు మార్కెట్ గద్దబొమ్మ సెంటర్లో గురువారం చలివేంద్రంని ఏ సి పి చేతులు మీదుగా లాంఛనంగా ప్రారంభించారు. తొలిరోజు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏ సి పీ పెద్ది రమేష్ సామాజిక సేవలను కొనియాడారు. వేసవి కాలం వచ్చిందంటే పశ్చిమ నియోజక వర్గ పరిధిలో ప్రజలు రమేష్ ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో కూలింగ్ నీటితో దాహార్తిని తీర్చుకొంటున్నారని పెద్ది రమేష్ మార్గంలో ప్రజాసేవా సంఘాలు వేసవిలో తమ సేవలను అందించాలని ఏ సి పీ పిలుపునిచ్చారు. ఐతే గురువారం వన్ పోలీసు స్టేషన్ పరిధిలో 2,కలరా ఆసుపత్రి ఎదురుగా 1, కేబిఎన్ కళాశాల వద్ద, మొత్తం నాలుగు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయడం హర్షణీయం అన్నారు. రమేష్ తో పాటుగా ఈ కార్యక్రమంలో భవన బిల్డర్లు, మేస్త్రులు, కార్మికులు నల్లబిల్లి శ్రీనివాసరావు, కరణం పార్ధు, నాగోతి (ఉంగరాల) శ్రీను,రాంపిల్ల వెంకటేష్, కత్తెర సురేష్,తామాడ తిరుపతరావు,దాసరి ఏసు,గంగిరెడ్డి భాస్కరరావు,జీ గణేష్, జగదీష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# భారీగా జనసమీకరణ చేయాలి





**ప్రతి కార్యక్రమాన్ని మన ఇంట్లో శుభకార్యంగా భావించాలి**

**శంఖారావాన్ని సంపూర్ణంగా విజయవంతం చేయాలి**

**14న మైలవరంలో జయహో బీసీ సదస్సు**

**16న మైలవరంలో ఎస్సీ సదస్సు**

**సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి**

**టీడీపీ కూటమి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్**

**గొల్లపూడిలో బూత్ కమిటీ సభ్యుల సమావేశం**

**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** ప్రతి కార్యక్రమాన్ని మన ఇంట్లో శుభకార్యం లాగా భావించి ఎవరికి వారు స్వచ్ఛందంగా తరలి రావడంతో పాటు భారీగా జన సమీకరణ కూడా చేయాలని మైలవరం తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. విజయవాడ రూరల్ గొల్లపూడిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కొండపల్లి మున్సిపాలిటీ బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ముందుగా శంఖారావం కార్యక్రమాన్ని సంపూర్ణంగా విజయవంతం చేయాలన్నారు. ఇదే సందర్భంలో సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. వాలంటీర్లకు రూ.10 వేలు, పింఛన్లు రూ4,000లు, దివ్యాంగులకు పెన్షన్ రూ.6000లు, రాష్ట్రంలో మహిళలకు నెలకు రూ.1500లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, నిరుద్యోగులకు నెలకు రూ.3000ల నిరుద్యోగ భృతి, తల్లికి వందనం–ఒకో బిడ్డకు రూ.15000లు, ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, రైతులకు ఏటా రూ.20 వేలు, ఉద్యోగాలు కల్పన, మెగా డీఎస్సీ తదితర పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈనెల 14న మైలవరంలో జయహో బీసీ సదస్సు, 16న ఎస్సీ సదస్సు నిర్వహిస్తున్నామని వీటిని జయప్రదం చేయాలని కోరారు. 22న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు వెల్లడించారు. వచ్చే 6 రోజులు కొండపల్లి మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నంలో విస్తృతంగా పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. బూత్ కమిటీ కన్వీనర్లు పోల్ మేనేజ్మెంట్ను సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు. కొండపల్లి మున్సిపాలిటీలో కార్మికులు, శ్రామికులు, ఉద్యోగులు, భిన్న వర్గాల వారు ఎంతో మంది ఉన్నారని గడిచిన ఐదేళ్ల కాలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో వాళ్లు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆ విషయాలన్నీ వాళ్లకు తెలియజేయాలన్నారు. అభివృద్ధి లేక సరైన పనులు లేక అందరూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబునాయుడు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్ కూడా మైలవరం నియోజకవర్గంలో పర్యటించనున్నారు అని పేర్కొన్నారు. అందరూ ప్రణాళికా బద్ధంగా పని చేయాలన్నారు. ఈ 30 రోజులు ఎంతో కీలకమన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారందరికీ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. మైలవరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేసేందుకు పనిచేయాలి అన్నారు. ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. కొండపల్లిలో ఇంటింటికీ నీటి కుళాయి పథకం, పుర పథకం, అమృత్ పథకం పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి, తెలుగుదేశం, జనసేన పార్టీ మహాకూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# సమిష్టి కృషి చేద్దాం

**వచ్చే ఎన్నికల్లో జనసేనకి అత్యధిక మెజారిటీ సాధనే లక్ష్యం**

**జనసేన పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్**

**అవనిగడ్డ మేజర్ న్యూస్:** వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీకి అత్యధిక మెజారిటీ సాధనే లక్ష్యంగా సమిష్టి కృషి చేద్దామని జనసేన పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ కోరారు. బుధవారం అవనిగడ్డలో బుద్ధప్రసాద్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ ఆధ్వర్యంలో నాగాయలంక మండల జనసైనికులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో నాగాయలంక మండల సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. బండ్రెడ్డి మల్లి, బండ్రెడ్డి హరి, బొద్దు విజయ్, కొక్కిలిగడ్డ లంకేశ్వర రావు, మత్తి రాజా, లేబాక అంకాలు, రేమాల మురళీ, బీ.పాపారావు, ఎం.సురేష్, రామకృష్ణలతో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను అఖండ మెజారిటీతో విజయం సాధించేలా కలిసి పని చేద్దామని నూతన కమిటీ సభ్యులకు బుద్ధప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధిని చూసి ఓటేయండి : విమలాబాను



**జగ్గయ్యపేట, ఏప్రిల్ 11, మేజర్ న్యూస్:** మండలంలోని గరికపాడు గ్రామంలో ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సతీమణి సామినేని విమల భాను ఫౌండేషన్ చైర్మన్ విమల భాను ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విమలభాను మాట్లాడుతూ సంక్షేమ పథకాలు తిరిగి కొనసాగాలన్న అవ్వ తాతలకు ఇంటి వద్దకే పెన్షన్ అందించాలన్న ఫ్యాను గుర్తుపై ఓట్లు వేయాలన్నారు. అలాగే జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఉదయభాను చేసిన అభివృద్ధిని గమనించాలన్నారు. ఎంపీగా కేశినేని నాని, ఎమ్మెల్యేగా ఉదయభాను కు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు.

## వసంత కాలనీ మసీదుకు విరాళం

**పట్టణ వైసీపీ అధ్యక్షుడు వేమా సురేష్ బాబు**



**కంచికచర్ల ఏప్రిల్ 11 మేజర్ న్యూస్ :** స్థానిక వసంత కాలనీ మసీదు కు 20 వేల రూపాయలు విరాళాన్ని పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు గురువారం అందించారు. రంజాన్ పండుగ సందర్భంగా వసంత కాలనీ ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు మసీదు ను సురేష్ బాబు సందర్శించారు ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వారు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తక్షణమే అయిన స్పందించి ఇప్పుడు ఎన్నికల సమయం కనుక సమస్యలను నియోజకవర్గ ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. అప్పటి వరకు నాకు చేతనైన సహాయం అందిస్తానని మాట ఈవడమే కాకుండా వెంటనే 20 వేల రూపాయలు విరాళాన్ని మసీదు మత పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు మసీదు మత పెద్దలు, యం డి షబ్బీర్, షేక్ రజీమ్, షేక్ మౌలాలి, షేక్ నాగులు మీరా షేక్ సుభానీ, షేక్ ఖాసిం, షేక్ రాజక్ తదితరులు పాల్గొన్నారు.



**బహుజన రాజ్యం స్థాపించడమే**

# బీఎస్పీ లక్ష్యం

**నందిగామ ఏప్రిల్ 11 మేజర్ న్యూస్:** మహాత్మ పూలే జయంతిని పురస్కరించుకొని గురువారం స్థానిక గాంధీ సెంటర్లో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ అధ్యక్షుడు దున్నా. కోటేశ్వరరావు అధ్యక్షతన మహాత్మ జ్యోతి బా పూలే 197వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.తొలుత బీఎస్పీ నాయకులు మహాత్మ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి బర్రె. ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ భారతీయ సమాజంలో కులవివక్ష వ్యతిరేకంగా పోరాటం చేసి బహుజన కులాలకు హక్కులు అందించిన నాయకుడు మహాత్మ పూలే అని కొనియాడారు. మహాత్మ పూలే సిద్ధాంతాలు మీద నడిచే పార్టీ బి.ఎస్.పి అని, ఆయన ఆశయాలతో కొనసాగుతూ నందిగామ లో బహుజన రాజ్యం స్థాపిస్తామని ఉదయ్ కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర ప్రధనకార్యదర్శి బచ్చలకూర. పుష్పరాజ్, నాయకులు శివా, కృష్ణా, దినేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

# పొత్తు పార్టీలను నమ్మని ప్రజలు





**నందిగామ, ఏప్రిల్ 11, మేజర్ న్యూస్:** పట్టణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామాలకు చెందిన 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైసీపీలో చేరారు. షేక్ కరీముల్లా, చింతల శివయ్య, ఉప్పుతోళ్ల గోపి, చింతల వెంకటరావు, కొప్పూరు కోటేశ్వరరావు తదితరులకు సాదరంగా కండవాలు కప్పి ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మూడు పార్టీలు కలిసి పొత్తులతో పోటీ చేస్తున్నా వారికి గెలుస్తామనే నమ్మకం లేక నిత్యం అబద్దాలతో ప్రజలను మభ్యపెట్టడం, విష ప్రచారాలు చేయడమే లక్ష్యంగా తెలుగుదేశం నేతలు పనిచేస్తున్నారు. రాష్ట్రంలో 14 ఏళ్ళు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు పేరు చెబితే గుర్తొచ్చే పథకం ఒకటి లేదు. ఆయన పేరు చెబితే గుర్తొచ్చే మంచి ఒకటి లేదు. మోసాలు, కుట్రలతో చంద్ర బాబు నాయుడు హామీలను అమలు చేయకుండా విశ్వసనీత లేని పాలన చేశారు. నందిగామలో గత తెలుగుదేశం ఎమ్మెల్యేకు నేడు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేకు గల వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలి. ఎవరు మనకు సేవలందిస్తున్నారో ఎవరు మన గ్రామాన్ని అభివృద్ధి చేశారో ఎవరు మనకి మేలు చేస్తున్నారు. ఎవరి ద్వారా అభివృద్ధి సాధ్యమైందో ఆలోచించి ఓటు వేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.